# స్త్రీ X స్త్రీ

అరగంట కష్టపడి మేకప్ పూర్తి చేసుకొని లేని అందాలను తెచ్చు కొని ఓ మాదిరి ఆకర్షణీయంగాతయారైంది సావిత్రి. భర్త రాక కోసం ఎదురుచూస్తూ తలుపుతీసుకొని బయటకొచ్చి రోడ్ మీదకు తొంగిచూసింది. శ్రీవారింకా రావటం లేదు. ఆమె దృష్టి ఎదురింటి మీదకు మళ్ళింది, ఎదురింటి అమ్మాయి పల్లవి ఎవరికోసమో నిరీక్షిస్తూ బయట నిలబడివుంది.

"హూ ! దీనికి పనిపాట లేదు. రోడ్డు మీద ఏ వెంగవెధవ కనిపిస్తాడా అని ఎదురుచూస్తూంటుంది. ఆ అలంకరణ ఏంటి – సిగ్గు లేకుండా స్లీవ్‌లెస్ జాకెట్ అమ్మో! మా వారు మంచివారు కాబట్టి సరిపోయింది, ఇంకొకరైతేనా దీని టక్కులకు పడిపోరూ?" విసుక్కుంది మనసులో కుందనపు బొమ్మలాంటి పల్లవిని.

ఆర్నెల్ల తరువాత పల్లవికి పెళ్ళయ్యింది. భర్తతో పాటు షికారుకు పోతుంటే చూసింది సావిత్రి "అమ్మో! ఏం విరగబాటు? దీనికి మొగుడున్నాడనా? దీని మొగుడే అందంగా ఉన్నాడనా? పదిమంది చూస్తారనే సిగ్గు కూడ లేకుండా మొగుడి భుజం మీదవాలిపోతూ స్కూటర్ వెనకాల కూచోని వెళుతున్నది సిగ్గులేంది." మనసులో తిట్టుకుంది సావిత్రి.

సంవత్సరం తరువాత – పల్లవి పసుపు కుంకమలు పోగొట్టుకొని పుట్టింటికి చేరుకొంది. సావిత్రి బజారుకు పోదామని బయలు దేరింది. ఎదురింటి ముందు శూన్యంలోకి చూస్తూ పల్లవి కనిపించింది.

"ఛీ ఛీ వెధవశకునం! మొగుడ్ని పోగొట్టుకొని ఓ మూల పడిఉండక తగుదునమ్మా అంటూ వరండాలో ఎందుకు చావాలి? ఇవ్వాళ ఏపనులు కావు!" చీదరించు కుంటూ లోపలికి వెళ్ళి తలుపుదబాలున మూసికొంది సావిత్రి.

ఓ నెలతరువాత – "విన్నారా! ఏమండీ మిమ్మల్నే ! అదిసిగ్గు లేకుండా మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నదట!!"

"ఎవరూ? పల్లవా? చాల సంతోషం". అన్నాడు సావిత్రి భర్త శేఖర్.

"ఛీ ఛీ వెధవ ముండకు పెళ్ళేమిటి? మీరు అలాగే అంటారు. చేసుకొనే వాడికే సిగ్గులేనట్టున్నది. పైగా వాడికిది మొదటి పెళ్ళేనట!"

"సావిత్రి ! కొంచెం ఆలోచించు. ఆ అమ్మాయికి నిండా ఇరవై ఏండ్లు లేవు."

"ఓ యబ్బ? అదంటే ఎందుకండి అంత సానుభూతి? ఓర్నాయనో ! అది ఏమగవాడినైనా బుట్టలో వేసి కోగలదు!" అంటూ గుండెలు బాదు కొంది సావిత్రి.

"సావిత్రి? అందంగా ఉండటం పల్లవి తప్పుకాదు. నీవు ఒక స్త్రీవి అనే సంగతి మరచిపోకు. స్త్రీ కి స్త్రీ యే శత్రువు కాకూడదు. స్త్రీ ఈ సమాజంలోపురుషుల వల్లనే బాధపడుతున్నది తోడి స్త్రీ లుకూడ బాధిస్తే ఎలా?" భర్త మాటలకు సావిత్రి స్థాణువులా నిలుచుండి పోయింది.